

సిబ్బంది సంక్షేమమే లక్ష్యం : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ : సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తుందని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పోలీసు సంక్షేమ దివస్ కార్యక్రమాన్ని ఈ శుక్రవారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ స్వయంగా పాల్గొని సిబ్బంది వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ ఫిర్యాదులపై వెంటనే స్పందించిన ఆయన ఆయా అధికారులకు ఈ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని వారికి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమ లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరికైనా అత్యవసర సహాయం అవసరమైతే వెంటనే తనను రోజుతో సంబంధం లేకుండా కలిసి ఫిర్యాదు చేయవచ్చునని ఆయన సూచించారు. సిబ్బందికి ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలని పోలీసు అధికారులకు సూచనలు జారీచేశారు.

సినిమాకెళ్తే జేబుకు చిల్లే..!

- సినిమా హాళ్లలో తినుబండారాల ధరల మోత
- పాప్‌కార్న్ ధర పెద్దది రూ.వంద, చిన్నది రూ.50
- రూ.పది ఖరీదు చేసే దిల్‌పసంద్ రూ.30
- చిన్నపాటి సమోసా ధర రూ.8
- ఫోన్‌పే, గూగుల్ పే వంటి ఆన్‌లైన్ చెల్లింపులు కుదరవని హుకుం
- మొద్దునిద్రలో తనిఖీ అధికారులు
- రెండు జిల్లాల్లో 40కుపైగా థియేటర్లపై పర్యవేక్షణ కరువు



ఏలూరు నగరంలోని ఓ సినిమా థియేటర్‌లో తినుబండారాల దుకాణాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాన్య ప్రజానీకానికి సినిమా వినోదం భారంగా మారింది. సినిమాకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. సినిమా విడుదలైన తర్వాత పది రోజులపాటు సినిమా టిక్కెట్ల ధరల పెంపునకు ప్రభుత్వాలు అనుమతిస్తున్నాయి. టిక్కెట్ల భారానికి తోడు సినిమా హాళ్లలో తినుబండారాల ధరలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. సినిమా హాళ్లలో నిబంధనల అమలు చేయాల్సిన అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 40కుపైగా సినిమా థియేటర్లు ఉన్నాయి. ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు వంటి పట్టణాల్లో పదుల సంఖ్యలో థియేటర్లు ఉండగా పలు మండల కేంద్రాల్లోనూ సినిమా థియేటర్లు కొనసాగుతున్నాయి. సంక్రాంతి పండుగకు కొత్త సినిమాలు గేమ్‌ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహారాజ్ వంటి పెద్ద హీరోల సినిమాలు విడుదలయ్యాయి. పండుగ నేపథ్యంలో సినిమా చూసేందుకు వెళ్తున్న జనాలను సినిమా హాళ్లలో తినుబండారాల ధరల పేరుతో పీక్కుతింటున్న పరిస్థితి ఉంది. నిబంధనల ప్రకారం సినిమా హాళ్లలో తినుబండారాల ధరలకు సంబంధించి పట్టిక రూపంలో ప్రదర్శించాలి. ఆ పని పెద్దగా జరగడం లేదు. దీంతో తినుబండారాల ధరలు భారీగా పెంచేసి ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. చిన్నపాటి దిల్‌పసంద్ ముక్క మార్కెట్లో రూ.పది నుంచి రూ.15కు విక్రయిస్తుండగా ఏలూరు సత్యనారాయణ థియేటర్‌లో రూ.30కు విక్రయిస్తున్న పరిస్థితి ఉంది. మిగిలిన సినిమా హాళ్లలోనూ ఇదే పరిస్థితి. ఇక పాప్‌కార్న్ ధర పెద్దప్యాకెట్ రూ.వంద, చిన్నప్యాకెట్ రూ.50కు అమ్ముతున్నారు. చిన్నపాటి సమోసాలు బయట రూ.నాలుగుకు విక్రయిస్తుండగా, సినిమా హాల్‌లో రూ.ఎనిమిది వరకూ అమ్ముతున్నారు. ఇక కూల్‌డ్రింక్స్, ఇతర తినుబండారాలకు సైతం పెద్దఎత్తున ధర నిర్ణయించి వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. తినుబండారాలు కొనుగోలు చేసిన వారు నగదు రూపంలో మాత్రమే చెల్లింపులు చేయాలని నిబంధన పెడుతున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే వంటి ఆన్‌లైన్ చెల్లింపులు కుదరవని హుకుం జారీ చేస్తున్నారు. ఆన్‌లైన్ చెల్లింపు జరిగితే అక్కడ ధరల విషయం బయటికి తెలిసిపోతుందని ఆంక్షలు పెడుతున్న పరిస్థితి ఉంది. తినుబండారాల ధరలపై ఎవరైనా ప్రశ్నిస్తే దురుసుగా ప్రవరిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో సినిమా టిక్కెట్ ధరలతోపాటు తినుబండారాలకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. నలుగురు సభ్యులున్న కుటుంబం సినిమాకు వెళ్తే టిక్కెట్లకు రూ.1200, తినుబండారాలకు మరో రూ.400 దాదాపు రూ.1600 వరకూ ఖర్చవుతోంది.

వేలాది మంది సమస్యపై తీవ్ర నిర్లక్ష్యం

రెండు జిల్లాల్లో 40కుపైగా సినిమా థియేటర్లు ఉండగా ప్రతిరోజూ నాలుగు షోలు వేస్తుంటారు. పండుగ సీజన్ కావడంతో ఐదు షోలు కూడా వేస్తున్నారు. ప్రతిరోజూ వేలాది మంది సినిమా చూస్తుంటారు. ఇంతమంది జనం ఇబ్బందులు పడుతున్నా సినిమా హాళ్లలో నిబంధనల అమలుపై రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సినిమా హాళ్ల యజమానులు ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నారు. తినుబండారాల ధరలు, నాణ్యతకు సంబంధించి అధికారులు ఎందుకు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి. జనం పెద్దఎత్తున వెళ్లే సినిమా హాళ్లలో తినుబండారాలు, ఇతర నిబంధనలను కచ్చితంగా అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.



సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళన

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలి

చిల్లబోయినపల్లి సబ్ స్టేషన్ వద్ద రైతుల ఆందోళన

ఎఇ హామీతో ఆందోళన విరమణ


ప్రజాశక్తి - ముసునూరు

వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ ఏడు గంటలే ఇస్తున్నారని, తొమ్మిది గంటలు ఇవ్వాలని కోరుతూ చిల్లబోయినపల్లి గ్రామ రైతులు శుక్రవారం ఆ గ్రామ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత 20 రోజులుగా ఎనిమిది గంటలే వ్యవసాయ విద్యుత్ సరఫరా చేశారని, తాజాగా ఏడు గంటలే ఇస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాగైతే పంటలు ఎలా పండించాలని, ఇప్పటికే రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టామని వాపోయారు. మొక్కజొన్న, పొగాకు, మిర్చి, వరి, కూరగాయ పంటలు సాగు చేస్తున్న తాము తీవ్రంగా నష్టపోతామని, తక్షణం తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీంతో విద్యుత్ శాఖ ఎఇ అక్కడికి చేరుకుని తొమ్మిది గంటలు విద్యుత్ ఇస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కండెపు రామగిరిరావు, బుజ్జియ్య, చిన్న, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, చెన్నయ్య, రాంబాబు, వెంకటరత్నం, చిన్న పండు, వీరభద్రరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు జ్యోతిబసు

16వ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

అందరికీ ఆదర్శనీయులు సిపిఎం అగ్రనేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత రవితోపాటు నేత వై.నాగేంద్రరావు జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ నేత, ఆదర్శమూర్తి జ్యోతిబసు అని కొనియాడారు. అందరికీ విద్య, వైద్యం, భూమి, ఉపాధి ఉండాలని తపిస్తూ ప్రజాపోరాటాలు సాగించిన ధీరోదత్త నేత జ్యోతిబసు అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు నిర్వహించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. 35 సంవత్సరాలు పశ్చిమబెంగాల్ సిఎంగా ఉండి వ్యవసాయ కార్మికులకు లక్షలాది ఎకరాల భూమిని పంచిన ఘనత, కార్మికులకు సమగ్ర చట్టం, కౌలురైతులకు హక్కు కల్పనలో ఆయన ముందు నిలిచారన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు తామా ముత్యాలమ్మ, ఎం.సుధారాణి, వై.నాగేంద్రరావు, నేతలు బి.నాని, కె.రెడ్డి, బి.వెంకటేశ్వరరావు, కె.సుబ్బారావు పాల్గొన్నారు.



అత్యంత పరిశుభ్ర జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ : కలెక్టర్ వెట్రిసెల్వి


ప్రజాశక్తి - ఏలూరు

స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కింద రానున్న వంద రోజుల్లో అత్యంత పరిశుభ్ర జిల్లాగా ఏలూరు జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో 'స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్' కార్యక్రమం నిర్వహణపై సంబంధిత అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని పటిష్టవంతంగా అమలు చేసేందుకు ఆయా శాఖలవారీగా నోడల్ అధికారులను నియమించాలన్నారు. ఏలూరు నగరంలో శనివారం పాత బస్టాండు ప్రాంతంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమ నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. శ్రమదానం, మానవహారం, ప్రతిజ్ఞ, ఆయా ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాలన్నారు. ఈ సమయంలో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానికులను, కళాశాల విద్యార్థులను, వాకర్స్ అసోషియేషన్లను, స్వచ్ఛంద సంస్థలను, ప్రజాప్రతినిధులను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో హాకర్స్, ఇతర ఆహార పదార్థాల విక్రయాలకు సంబంధించిన షాపులను హెల్త్ ఇన్‌స్పెక్టర్లతో గుర్తించి వాటిలో ఆహార పదార్థాలు హ్యాండ్లింగ్ పరిశుభ్రత పాటించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయా షాపులకు ఒకటి నుంచి పది వరకు ర్యాంకులను ఇవ్వాలన్నారు. చెత్త తీసేసిన కూడళ్లలో తిరిగి చెత్త వేసేందుకు వీల్లేని విధంగా ఆ పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచేందుకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మార్కెట్, బస్టాండు, రైల్వేస్టేషన్ తదితర పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీలైనచోట్ల మొక్కలను నాటేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, నగరపాలక కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిపిఒ కె.అనురాధ, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, ఇన్‌ఛార్జి ఉప రవాణా కమిషనర్ కెఎస్ఎంవి.కృష్ణారావు, ఆర్‌టిసి పిఆర్ఒ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోండి

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుల ధర్నా

గిరిజనులకు ఎస్‌డిసి కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ గిరిజనేతరులకు అనుకూలంగా ప్రొటెక్షన్ ఆర్డర్ ఇచ్చిన తహశీల్దార్ చలపతిరావుపై చర్యలు తీసుకోవాలని, ఆదివాసీ చట్టాలను పరిరక్షించాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ బుట్టాయిగూడెం మండలం జైనువారిగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం:41/2లో 2.50 ఎకరాల భూమిలో గిరిజనేతరులకు అనుకూలంగా తహశీల్దార్ చలపతిరావు గత డిసెంబర్‌లో ప్రొటెక్షన్ ఆర్డర్ ఇచ్చారన్నారు. రికార్డు వెరిఫికేషన్ చేయకుండా ఏకపక్షంగా గిరిజనేతరులకు అనుకూలంగా ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. సదరు సర్వే నెంబర్‌పై ఎస్‌డిసి కోర్టు 15/2002లో గిరిజనులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ కాసులకు అమ్ముడుపోయి గిరిజనేతరులకు కొమ్ముకాస్తున్నార న్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల్లో మండల రెవెన్యూ అధికారులు అడ్డుపడుతున్నారని, దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తహశీల్దార్ చలపతిరావుపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన చట్టాలను రక్షించాల్సిన రెవెన్యూ అధికారులే గిరిజనేతరులకు కొమ్ముకాస్తూ గిరిజనులను నేరస్తులుగా ముద్రించడం దారుణమని, ఈ ధోరణి మార్చుకోవాలని కోరారు. రికార్డు వెరిఫికేషన్ చేయకుండా ఏకపక్షంగా నిర్ణయాలు చేయడమే కాకుండా ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇవ్వడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో జైనువారిగూడెం గ్రామస్తులు సోయం శ్రీనివాస్, ఇరప అన్నపూర్ణ పాల్గొన్నారు.

మున్సిపాల్టీలకు నిధుల కోసం కృషి చేస్తా : ఎంపీ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీకి అవసరమైన నిధులపై ఎంపీకి ప్రతిపాదనలు అందిస్తున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ కెవి.రమణ

మున్సిపాల్టీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌తో కలిసి జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కెవి.రమణతో ఎంపీ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ రెండు మున్సిపాల్టీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. రూ.12 కోట్ల ఆదాయం కలిగిన జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీని గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1గా వర్గోన్నతి కల్పించాలని పంపిన నివేదిక ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని కమిషనర్ కెవి.రమణ ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపాల్టీల్లో మౌలిక వసతుల కల్పనకు ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్‌తో కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సాధ్యమైనన్ని ఎక్కువ నిధులు రాబట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణానికి రూ.80 కోట్లు, సెంట్రల్ లైటింగ్, పార్కుల అభివృద్ధి, ఇతరత్రా పనులు చేపట్టేందుకు రూ.50 కోట్లు, చింతలపూడి మున్సిపాల్టీలో అభివృద్ధి పనులకు రూ.42 కోట్లు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రానున్న బడ్జెట్లో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు ఎంపీ చెప్పారు.

మాజీ సర్పంచి నల్లయ్య హత్య

ప్రజాశక్తి - కలిదిండి



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

పాత కక్షల నేపథ్యంలో మండలంలోని సంతోషపురం గ్రామ మాజీ సర్పంచి కాల్వ నల్లయ్య(55) హత్యకు గురయ్యారు. శుక్రవారం కైకలూరు రూరల్ సిఐ రవికుమార్, ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. వివరాల ప్రకారం సంతోషపురం, భోగేశ్వరలంక మార్గ మధ్యలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. బైక్‌పై వెళుతున్న నల్లయ్యపై దాడి జరిగింది. తలపై బలమైన గాయాలవ్వడంతో తొలుత స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం భీమవరం ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడు కాల్వ నల్లయ్య గ్రామ సర్పంచిగా, ఎంపిటిసిగా పనిచేశారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, భార్య అన్నారు. మృతుని కుమారుడు ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ముదినేపల్లి



ఎస్‌జివి కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

వారంతా 15 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్నారు. ఎక్కడెక్కడో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. సంక్రాంతి సందర్భంగా వారంతా కలిసి అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అప్పుడు చదువుకున్న కళాశాలలో రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ముదినేపల్లిలోని ఎస్‌జివి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2009-2011 సంవత్సరం ఇంటర్ బ్యాచ్ చెందిన విద్యార్థులు శుక్రవారం అదే కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చతిస్‌ఘడ్, నాగపూర్, హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వారు విచ్చేశారు. చదువుకున్న రోజుల్లోనే పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. అప్పటి ప్రిన్సిపల్ కృపావరం, లెక్చరర్స్ మల్లికార్జున్, రాంబాబు, విశ్వనాథం, చక్రవర్తి, శ్రీనివాసరావు, విజయలక్ష్మిలను సత్కరించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళ కార్యక్రమం శివ, నరేష్, బివి.సాగర్, రూపేంద్ర, అశోక్, నాగరాజు ఆధ్వర్యంలో జరిగింది.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి



వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఎ చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గత వైసిపి పాలకులు తమ దుర్మార్గపాలనలో సృష్టించిన సమస్యల చెర నుంచి ఏలూరు నియోజకవర్గానికి విముక్తి కల్పించడమే తన ధ్యేయమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి వ్యాఖ్యానించారు. ఇదేక్రమంలో ఏలూరు నగరంలో ఎక్కడా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కూడా ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఏలూరులోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయానికి శుక్రవారం పలువురు తమ వినతులందించేందుకు క్యూకట్టారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఎంఎల్‌ఎ కలిశారు. నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. ఇదేక్రమంలో ఏలూరు పత్తేబాద రైతుబజార్ వద్ద పార్కింగ్ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏలూరు ట్రాఫిక్ సిఐ ఎస్.లక్ష్మణరావును ఆదేశించారు. నగరంలో ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ గత వైసిపి పాలకులు చేసిన అరాచక పాలనతో ఏలూరు నియోజకవర్గంలో అనేక ప్రజా సమస్యలు తిష్టవేశాయన్నారు. వాటన్నింటినీ దశలవారీగా పరిష్కరించేందుకు కృషిచేస్తున్నానని అన్నారు. ప్రజలు కూడా తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు పెద్దిబోయిన శివప్రసాద్, త్రిపర్ణ రాజేష్ పాల్గొన్నారు.

కోతకు గురైన జాతీయ రహదారి

ప్రమాదపుటంచున వాహనదారులు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి




రోడ్డు మార్జిన్ కోతకు గురైన ప్రాంతం..

పామర్రు-దిగమర్రు 165 జాతీయ రహదారిలో ముదినేపల్లి హై స్కూల్ ఎదురుగా జాతీయ రహదారి కోతకు గురైంది. ముదినేపల్లి నుంచి కైకలూరు వెళ్లే రోడ్డులో పోల్‌రాజ్ ప్రధాన పంట కాలువ నీటి ప్రవాహానికి రోడ్డు మార్జిన్ పూర్తిగా కోతకు గురైంది. హైస్కూల్ ఎదురుగా జాతీయ రహదారి కోతకు గురై 20 ఏళ్లు పైబడినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. రహదారి కోతకు గురైన ప్రాంతంలో అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. రోడ్డు మార్జిన్ పూర్తిగా కాలువలో కలిసిపోయి రోడ్డు అండలుగా విరిగిపోయి కాలువలో పడిపోతుంది. ఈ కారణంగా ఆ ప్రాంతం పెద్ద గుంతగా తయారైంది. అంతేకాక ఈ ప్రాంతంలో దట్టంగా ముళ్ల పొదలు పెరిగిపోవడంతో కోతకు గురైన ప్రాంతం వాహనదారులకు కనిపించడం లేదు. దీంతో ఈ రహదారిలో ప్రయాణం చేసే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక రాత్రి సమయాల్లో ఈ రహదారుపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు మార్జిన్ కోతకు గురైన ప్రాంతం ఎదురుగా హైస్కూల్ ఉండడంతో తరచూ పిల్లలు ఈ కాల్వ కోత గురైన ప్రాంతంలో ఆడుకునేందుకు వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు వెంటనే స్పందించి ప్రమాదాలు జరగక ముందే రోడ్డు కోత గురైన ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మించి, ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

గల్ఫ్ నుంచి స్వదేశానికి చేర్చాలని ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



ఎంఎల్‌ఎకు వినతిని అందజేస్తున్న కుటుంబీకులు

గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్నామని, స్వదేశానికి చేర్చాలని మండలంలోని తాటియాకులగూడెం గ్రామానికి చెందిన మద్దిపాటి కృష్ణ అనే వ్యక్తి వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కుటుంబ సభ్యులు ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన మద్దాల కృష్ణ అతని భార్యతో కలిసి పొట్ట కూటి కోసం కొన్ని నెలల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లారు. అయితే అక్కడ భార్యభర్తలను సంబంధం లేకుండా వేర్వేరు చోట్ల పెట్టి పని చూపించకపోగ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని బాధితులు సోషల్ మీడియా ద్వారా వీడియో వైరల్ చేశారు. సమస్యను వారి కుటుంబ సభ్యులు స్థానిక ఎంఎల్‌ఎ బాలరాజు దృష్టికి తీసుకురాగా ఏజెంట్, పోలీసులతో ఫోన్లో మాట్లాడి బాధితులను స్వదేశానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎంఎల్‌ఎను కలిసిన వారిలో సర్పంచి వనమా రాంబాబు, నాయకులు సుబ్బారావు, రాధాకృష్ణ, గ్రామ జనసైనికులు ఉన్నారు.



యాక్టివిటీస్ పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ శారద

అంగన్వాడీ కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని రహమత్ నగర్, జయప్రకాష్ సెంటర్‌లోని అంగన్వాడీ కేంద్రాలను ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద శుక్రవారం సందర్శించారు. దీనిలో భాగంగా అంగన్వాడీలో నిర్వహించే అన్ని కార్యక్రమాలను ప్రీస్కూల్ యాక్టివిటీస్, పిల్లల ఎత్తులు, బరువులు, గర్భిణులు, బాలింతల ఎత్తు, బరువులు ఎఫ్ఆర్ఎస్‌ను పరిశీలించారు. వారికిచ్చే సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పిల్లలతో అభినయ గేయాలు కూడా చెప్పించారు. పిల్లలకు దోహదపడే శారీరక అభివృద్ధి, సాంఘిక అభివృద్ధి, గణిత అభివృద్ధి, మేధాభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పోషణ వాటికను సందర్శించి మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఎ.పద్మావతి, సూపర్వైజర్ మౌనిక, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా రాజకుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని రెవెన్యూ శాఖలో తహశీల్దార్ కె.రాజకుమార్ మరలా తహశీల్దార్ బాధ్యతలు చేపట్టారు. ఈయన గత నెల 13వ తేదీన అనారోగ్యం రీత్యా సెలవులోకి వెళ్లగా, ఆయన స్థానంలో జి.పురుషోత్తమ శర్మ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. మరలా శుక్రవారం నుంచి మండల రెవెన్యూ తహశీల్దార్‌గా కె.రాజకుమార్ పై స్థాయి అధికారుల సమక్షంలో బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

రేషన్ డీలర్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలో చౌక దుకాణాల(రేషన్ షాప్స్) ఖాళీలకు నోటిఫికేషన్ ఇచ్చామని ఉంగుటూరు ఇన్‌ఛార్జి తహశీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. దుకాణం నెంబర్ 1, 3, 9, 14, 26, 29 మొత్తం 6 దుకాణాలకు రిజర్వేషన్ వారీగా నోటిఫికేషన్ జారీ అయిందని, సచివాలయంలో నోటిఫికేషన్ ప్రదర్శన చేశామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 21 లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఉంగుటూరు ఎస్‌సి, యర్రమళ్ల బిసి-డి(మహిళ), బాదంపూడి బిసి-బి, దొంతవరం బిసి-ఎ, వికె పురం ఎస్‌సి, తిమ్మయ్యపాలెం బిసి-ఇ రిజర్వేషన్ కేటాయించారు. ఆయా గ్రామాల్లో రిజర్వేషన్ వారీగా అర్హత కలిగిన, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయంలో కాని, ఏలూరు ఆర్‌డిఒ కార్యాలయం కానీ నేరుగా లేదా, పోస్టు ద్వారా దరఖాస్తులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

సందర్శకుల సమయాలను ప్రదర్శించాలి

ఎస్‌టి బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం నాయకుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - దెందులూరు

జిల్లా పంచాయతీ అధికారి వారి కార్యాలయంలో సందర్శకుల సమయాలను ప్రదర్శించాలని ఎస్‌టి బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.కృష్ణా నాయక్, డి.రాజబాబు నాయక్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లాలో గిరిజన లంబాడి తండాల్లో లంబాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై, తండాల్లోని మంచినీటి సౌకర్యాలపై వినతి పత్రం సమర్పించి సదరు విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి వారి దృష్టికి తీసుకురావడం కోసం జిల్లా పంచాయతీ అధికారి వారి కార్యాలయానికి ఈనెల 16న ఉదయం 11 గంటలకు వెళ్లగా జిల్లా అధికారి వారు మీటింగ్‌కు వెళ్లారని, సాయంత్రం రమ్మని కార్యాలయ సిబ్బంది చెప్పడంతో మరలా తిరిగి సాయంత్రం మూడు గంటలకు జిల్లా పంచాయతీ అధికారి వారి కార్యాలయంకు వెళ్లడం జరిగిందని తెలిపారు. కార్యాలయ సిబ్బంది ద్వారా స్లిప్పు రాసి లోపలికి పంపించడం జరిగింది. సాయంత్రం ఐదు గంటల వరకు కూడా లోపల నుంచి మాకు ఏవిధమైనటువంటి పిలుపు రాలేదని వివరించారు. గిరిజన లంబాడీల ప్రతినిధిని కలవడానికి ఇష్టపడని జిల్లా అధికారి గత్యంతరం లేక వెనుదిరికి వెళ్లిపోవడం జరిగిందన్నారు. ఈ విధంగా జిల్లా అధికారులు పనిచేస్తుంటే గిరిజనులకు న్యాయం జరిగేది ఎప్పుడు, సందర్శకులను వారు కలిసేది ఎప్పుడు న్యాయం జరిగేదెన్నడు అని ప్రశ్నించారు. తక్షణమే పంచాయతీరాజ్ శాఖ మాత్యులు జోక్యం చేసుకొని ఈ కార్యాలయంలో విజిటర్స్ సమయాలను తెలియజేసే నోటీసు బోర్డులను ఏర్పాటు చేయించి, సందర్శకుల నుంచి వినతి పత్రాలు స్వీకరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏటా 15 శాతం వృద్ధే లక్ష్యం

ఉద్యాన, ఆక్వా, పాడిపరిశ్రమ అభివృద్ధిపై దృష్టిసారించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు : జిల్లాలో ఉద్యాన పంటల విస్తరణ, ఆక్వారంగం, పాడిపరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో నిర్దేశించిన లక్ష్యాలు, స్వర్ణాంధ్ర ఏ 2047లో భాగంగా రానున్న ఐదేళ్లలో సాధించే లక్ష్యాల అమలు, ప్రగతిపై నిర్దేశించిన కీ ఫెర్మార్మెన్స్ ఇండికేటర్స్‌పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో పండే ప్రధాన పంటలు, వాటి ఆధారంగా పరిశ్రమల అభివృద్ధి, సాగునీటి వసతి కల్పన, విస్తారంగా ఉన్న భూములకు డ్రిప్ ఇరిగేషన్ వంటివి కల్పించాలన్నారు. ఉద్యాన పంటల విస్తరణ, ఆక్వారంగం, పాడిపరిశ్రమ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. అన్నిరంగాల్లో జిల్లా సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ ప్రణాళికలో భాగంగా ఐదేళ్ల కాలంలో అభివృద్ధి లక్ష్యాలతో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రతివారం క్షేత్రస్థాయి అధికారులతో కూడా ఈ అంశాలపై మాట్లాడటం జరుగుతుందన్నారు. మార్చి నెలాఖరు నాటికి నూరు శాతం ఈ ఏడాది లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎస్.రామ్మోహన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్‌కె.హబీబ్ భాషా, ఎపిఎంఐపి పిడి పివిఎస్ రవికుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి కెఎస్‌వి.నాగలింగా చార్యులు, పశు సంవర్ధక శాఖ ఇన్‌ఛార్జి జెడి టి.గోవిందరాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్థావరాలపై దాడి

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారాయి తయారీ దారులకు బెల్లము అమ్మరాదని ఎన్ఫోర్స్‌మెంట్ సిఐ భోగేశ్వరరావు హెచ్చరించారు. చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చింతలపూడి మండలం తలార్లపల్లి గ్రామంలో నాటుసారాయి స్థావరాలపై ఎన్ఫోర్స్‌మెంట్ ఏలూరు, ఇఎస్‌టిఎఫ్ ఏలూరు, ఎక్సైజ్ స్టేషన్ ఏలూరు, స్థానిక ఎక్సైజ్ స్టేషన్ స్టేషన్ చింతలపూడి అధికారులు అందరూ కలిపి దాడులు నిర్వహించగా తలార్లపల్లి గ్రామంలో ఊరు శివారు(20) లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, 1000 లీటర్లు పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, స్థానిక ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడిలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని చింతలపూడి గ్రామంలో బెల్లపు విక్రయదారులు కొనుగోలు, అమ్మకాలు, నిల్వలను గురించి తెలుసుకొని, యజమానులు అందరికీ నాటు సారాయి తయారీ దారులకు బెల్లం అమ్మరాదని హెచ్చరించినట్లు తెలిపారు. మండలంలో నాటుసారా తయారీలో అనుమానితుడుగా ఉండుటచే తలర్లపల్లి గ్రామంలో దేశావతు రామయ్య అను వ్యక్తిని 128 బిఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ చింతలపూడి వారి ఎదుట హాజరు పరచి, వారిని తహశీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో ఇఎస్‌టిఎఫ్, ఎస్ఐ ఎండీ ఆరిఫ్, ఏలూరు స్టేషన్ ఎస్ఐ వై.గౌరీ శంకర్, స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రాంతీయ రవాణా అధికారి జి.నాగ మురళి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. తిరివీధి లక్ష్మీ రామారావు చారిటబుల్ సేవా ట్రస్ట్, స్వచ్ఛందంగా కార్యకర్తలు, ఆర్‌టిసి కార్మికులు, ఆటో డ్రైవర్ల సహకారంతో రహదారి భద్రతా మాసోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ రవాణా శాఖ అధికారి జి.నాగ మురళి, ఆర్‌టిసి డిపో మేనేజర్ పవన్ కుమార్ మాట్లాడుతూ వాహనచోదకులు నియమనిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మైనారిటీ తీరని వారికి వాహనాలను ఇవ్వడం నేరమన్నారు. మైనారిటీ తీరకుండా వాహనాలను నడిపితే జరిగే రోడ్డు ప్రమాదాలలో ఇరువైపులా వ్యక్తులు తీవ్ర నష్టాల బారిన పడుతున్నట్లు వివరించారు. ఇలాంటి సంఘటనల్లో వాహన యజమానులు, వాహనం నడిపిన బాలల తల్లిదండ్రులకు భారీ జరిమానాలతో పాటు శిక్షలు పడే అవకాశాలు ఉన్నాయన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడిపితే ఊహించని ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపే సమయంలో రోడ్డుపై ప్రాణాలు కోల్పోయిన అనేక సంఘటనలు వివరించారు. జాతీయస్థాయిలో రహదారి భద్రత, నియమ నిబంధనలు పాటించని కారణంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది మృత్యువాత పడుతున్నట్లు తెలిపారు. తప్పనిసరిగా ప్రతి వాహనచోదకుడు నియమ నిబంధనలు పాటించాలన్నారు. తిరివీధి లక్ష్మీ రామారావు చారిటబుల్ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి కృష్ణ మాట్లాడుతూ రహదారి భద్రత మాసోత్సవాలలో స్వచ్ఛంద సంస్థ తరఫున తాము కూడా భాగస్వాములుగా ముందడుగు వేసినట్లు తెలిపారు. వాహన



రహదారి భద్రతా మాసోత్సవాల్లో పోలీసు అధికారులు

చోదకులకు తమ సంస్థ తరఫున ఉచిత మెడికల్ క్యాంపులో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రాంతీయ రవాణా అధికారి నాగ మురళి సూచనల మేరకు నియమ నిబంధనలు పాటించాలన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలు పురస్కరించుకుని వాహనాలను నడిపే సమయంలో తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామన్నారు. ఎపిఎస్ఆర్‌టిసి నూజివీడు డిపో సూపర్వైజర్ పి.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రహదారిపై వాహనాలను నడిపే సమయంలో అనేక ప్రమాదాలు సంభవిస్తుంటాయని, మన ప్రయాణం కొనసాగుతూ ఉండగా కొన్ని ప్రమాదాలను చూస్తుంటామని అన్నారు. అలాంటి సందర్భంలో ప్రమాదాలలోని వారిని రక్షించేందుకు గోల్డెన్ అవర్‌గా చెప్పబడే మొదటి 60 నిమిషాల సమయం ఎంతో విలువైనదన్నారు. ఆ సమయంలో ప్రమాదంలోని వారిని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించే కార్యక్రమం చేపట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ఇలా చేయడం వల్ల ఎలాంటి కేసులు ఉండవని, ఎలాంటి భయాలకు తావు లేకుండా సాయం చేయాలన్నారు. ఇలా సాయం చేసే వారికి కేంద్ర ప్రభుత్వం రూ.25 వేల పారితోషికం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రమాదాలలోని వారిని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ రక్తదాతలుగా ఎదగాలన్నారు. సరైన సమయంలో రక్తం లభించక అనేక మంది మృతిచెందిన సంఘటనలు కళ్ల ముందు జరుగుతున్నాయన్నారు. ఒకరు చేసే రక్తదానం వల్ల ముగ్గురి ప్రాణాలను పరిరక్షించటం జరుగుతుందన్నారు. తాను 62 సార్లు రక్తదానం చేసే, తన మిత్రుడు సీనియర్ జర్నలిస్ట్ నీలా వన వెంకటేశ్వర్లు 40 సార్లు రక్తదానం చేసి ప్రమాదంలోని వారి ప్రాణాలను రక్షించినట్లు వివరించారు. ప్రతి వాహనచోదకుడు రక్తదాతగా ముందడుగు వేయాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లతో ఉండి, మద్యపానం,

సూచనలు

1. నిబంధనలు పాటిస్తూ.. సురక్షిత ప్రయాణం మేలు
2. మైనారిటీ తీరకుండా డ్రైవింగ్ ప్రమాదం
3. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే ప్రాణాపాయం
4. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ హానికరం
5. రహదారి భద్రత అందరి జీవితాలకు భరోసా
6. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయండి, చేయించండి
7. డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరాలు

ధూమపానం, పాన్ పరాగ్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. పోషకాహారం స్వీకరించడం ద్వారా ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతుందన్నారు. రక్తదానం చేయడం ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధుల నుంచి బయటపడిన సందర్భాలను వైద్యులు నిర్ధారించాలని వివరించారు.

మురుగు నీరు రోడ్లపైకి..

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని అశోక్‌నగర్‌గల తహశీల్దార్ కార్యాలయం నుంచి విక్టోరియా భవనం వరకు ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ చాలా దారుణంగా ఉంది. గాలిబ్ మాస్టర్ వీధిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. నీరు వెళ్లడానికి మార్గం లేకుండా మధ్యలో నిలిచిపోయింది. ఆ మురుగు నీరు ఎటూ వెళ్లకుండా అక్కడ స్టాక్ అవ్వడంతో భరించలేని దుర్వాసనతో ప్రజలు అటు వైపుగా ప్రయాణించలేని పరిస్థితిలో ఉన్నారు. ఇదే దారిలో తహశీల్దార్ కార్యాలయంకు వెళ్లే దారిలో అసలు మురుగు కాలువ కనిపించని పరిస్థితి. వెంటనే సదరు అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



కొయ్యలగూడెంలో..

ఉషాబాలా నగర్‌లో..

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ఉషాబాలా నగర్ ప్రాంతంలో డ్రెయినేజీల నిర్మాణం జరగకపోవడం వల్ల నివాస ప్రాంతాల నుంచి వచ్చే మురుగుదొడ్ల నీరు చిన్నపాటి చెరువుగా మారినట్లు స్థానికులు తెలిపారు. మురుగునీరు చేరుకొని పెద్ద గుంట ఏర్పడటం, ఎక్కడెక్కడి వారు చెత్తను తెచ్చి ఇదే మురుగు నీటిలో వేయడం వల్ల తీవ్ర దుర్గంధం వ్యాప్తి చెందుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటిని, చెత్తను తొలగించి, పక్కా డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టాలని ఎన్నోసార్లు అధికారులకు మీకోసం కార్యక్రమంలో విన్నవించినా ఏ ఒక్కరూ స్పందించలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి

సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక ప్రజల అవస్థలు

మురుగునీటిని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి బ్లీచింగ్ చల్లించాలని స్థానికులు కోరుతున్నారు. మురుగునీటితో ఏర్పడే దుర్గంధం కారణంగా దోమలు విపరీతంగా పెరిగి జ్వర పీడితులవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పక్కా డ్రెయినేజీని మున్సిపల్ అధికారులు నిర్మించాలని ఉషాబాలా నగర్ ప్రజలు కోరుతున్నారు.



నూజివీడు టౌన్‌లో..



ఎటిఎం నుంచి నగదు డ్రా చేస్తున్న ఖాతాదారులు

వినియోగంలోకి ఎటిఎం, సిడిఎం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో ఎస్‌బిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎటిఎం, సిడిఎం ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చాయి. ముదినేపల్లిలోని ఎస్‌బిఐ ఎటిఎం, సిడిఎం తరచూ మొరాయిస్తూ ఖాతాదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఎటిఎం, సిడిఎం గత కొన్ని రోజులుగా పనిచేయకపోవడంతో ఖాతాదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ సమస్యపై గురువారం ప్రజాశక్తి దినపత్రికలో ఎటిఎం ఎనీ టైం మరమ్మతులు అనే శీర్షికతో వార్త వెలువడిన విషయం పాఠకులకు విదితమే. దీనిపై స్పందించిన బ్యాంకు అధికారులు గురువారం సాయంత్రానికి ఎటిఎం, సిడిఎంలకు మరమ్మతులు చేపట్టారు. దీంతో రెండు మిషన్లు వినియోగంలోకి వచ్చాయి. దీంతో వినియోగదారులు ఎటిఎంకు వచ్చి నగదు డ్రా చేసుకుంటూన్నారు. ఎటిఎం, సిడిఎం వినియోగంలోకి రావడంతో ఖాతాదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు స్వచ్ఛతా దినోత్సవం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో నేడు స్వచ్ఛతా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.మణి కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛతా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం పారిశుధ్యంపై ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల వద్ద పొదలు తొలగించి, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఎంఎల్‌ఎను మర్యాదపూర్వకంగా కలిసిన ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కెఆర్ పురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా రాముల నాయక్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ బాలరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐటిడిఎ ప్రాజెక్టుకు సంబంధించి పలు విషయాలు చర్చించారు. ఐటిడిఎను అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు కృషి చేస్తానని అన్నారు. గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



ఎంఎల్‌ఎతో ఐటిడిఎ పిఒ నాయక్

అయ్య బాబోయ్ దోమలు..!

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని ప్రజలు దోమల బెడదతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకపక్క సీజనల్ వ్యాధుల భయం వెంటాడుతుంది. మరోపక్క దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు కూడా పొంచి ఉండటంతో వారి ఆందోళన మరింత పెరుగుతోంది. నివారణా చర్యలు అంతంతమాత్రంగానే చేపట్టుతుండడంతో దోమల ఉధృతి పెరిగి రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా పగులు అధిక ఉష్ణోగ్రతలతో విపరీత వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దోమల తీవ్రత భారీగా పెరుగుతోంది. బయట నిలబడాలంటే ప్రజలు భయపడుతున్నారు. దోమల కారణంగా డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రభలే అవకాశం ఎక్కువ ఉంటుంది. జ్వరపీడితులను గుర్తిస్తే కనీసం ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోనైనా దోమల నివారణా చర్యలు చేపట్టేవారు. అయితే ఇప్పుడు అటువంటి పరిస్థితులు కూడా కరువయ్యాయని పలు గ్రామాల్లో ప్రజలు చెబుతున్నారు. డ్రెయినేజీలో సిల్ట్ తొలగింపు ప్రక్రియ మండలంలోని పలు గ్రామాల్లో పూర్తికాలేదు. దీంతో నీరుకూడా సక్రమంగా దిగువకు పారటం లేదంటున్నారు. గ్రామాల్లో ఫాంగింగ్ చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి దోమల నివారణా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పింఛన్ ఇప్పించరూ!

వికలాంగుని తల్లిదండ్రుల ఆవేదన



వికలాంగుడైన కుమారుడుతో తల్లిదండ్రులు సాంబశివరావు, రంగమ్మ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని పోతురెడ్డిపల్లి గ్రామానికి చెందిన మందపాటి సాంబశివరావు, శివ రంగమ్మలకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు సురేష్ పుట్టుక్కతోనే వికలాంగుడు, మంచానికే పరిమితమయ్యాడు. రెండవ కుమారుడు ధనుష్ 9వ తరగతి చదువుతున్నాడు. కూలీ పనులు చేసుకుని కుటుంబాన్ని సాంబశివరావు పోషిస్తున్నారు. సాంబశివరావు భార్య శివ రంగమ్మ వికలాంగుడైన సురేష్‌ను ఇంటి వద్దనే ఉండి సాకుతూ సపర్యలు చేస్తున్నారు. గత 17 ఏళ్లుగా ఏ ఒక్కరూ కనికరం చూపలేదని సాంబశివరావు, శివ రంగమ్మ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ ఆసుపత్రికి వెళ్లినా తమను పట్టించుకున్న నాయకుడే కరువయ్యాడని బోరున విలపించారు. అన్నం కూడా అడగలేని తన కుమారుడు సురేష్‌ను కంటికి రెప్పలా కాపాడుకోవడమే తన బాధ్యతగా తల్లి రంగమ్మ తెలిపింది. బాబుకు ఆధార్ కార్డు రెండుసార్లు తీయించినా.. వేలిముద్రలు పడటం లేదని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు కనికరించి మంచానికే పరిమితమైన వికలాంగుడైన తమ కుమారుడు సురేష్‌కు వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని చేతులు జోడించి వేడుకుంటున్నారు.

దగ్గు, జలుబు, ఆయాసాలను అశ్రద్ధ చేయొద్దు

పట్టణ ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ సాయి నికిత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దగ్గు, జలుబు, ఆయాసాలను అశ్రద్ధ చేయవద్దని, నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకమైన బ్రాంకటీస్ నిమోనియా, ఇతర ప్రాణాంతక వ్యాధులుగా మారే అవకాశం ఉందని, జాగ్రత్త వహించాలని ఏలూరు తాపీ మేస్త్రి కాలనీ పట్టణ ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ సాయి నికిత సూచించారు. స్థానిక ఏలూరు టైటస్ నగర ప్రాంతంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 63 రకాల ఉచిత వైద్య పరీక్ష నిర్వహిస్తామని, శీతాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చలిగాలులు తగలకుండా తగు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. అనంతరం అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ అన్ని కాలాల్లో జ్వరాలు ఉంటాయని, ముఖ్యంగా దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. తద్వారా డెంగీ, మలేరియా, చికెన్ గునియా వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చని, దోమల వ్యాప్తి అరికట్టడంలో ప్రజలు భాగస్వామ్యులు అవ్వడం చాలా అవసరమని సూచించారు. అనంతరం ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.



ఫ్రై డే డ్రై డేపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

హెల్మెట్ తప్పనిసరి : సిఐ

జీలుగుమిల్లి : హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో సిబ్బందిచే వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన ధృవపత్రాలు లేకుండా వాహనాలు నడిపే పలువురికి జరిమానాలు విధించారు. అదేవిధంగా పెండింగ్ చలానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని వాహనదారులకు సూచించారు. తనిఖీలలో ఎస్ఐ నవీన్ కుమార్, కానిస్టేబుళ్లు లక్ష్మణ్, సుధాకర్, పరశురాం, నాయక్‌లు పాల్గొన్నారు.

22న జాబ్‌మేళా

ఏలూరు : జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయము(నేషనల్ కెరీర్ సర్వీసు) ఏలూరు వారి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన ఉదయం 9.30 నిమిషాలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో నిరుద్యోగ యువతీయువకులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలో శ్రీసిటీలోని పశ్చిమ ఆసియలో అతి పెద్ద కాడ్బెరి చాకొలేట్ తయారి కంపెనీ ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. ఈ కంపెనీలో టీం మెంబెర్ ట్రెయినీగా పనిచేయుటకు ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, ఐటిఐ మొదటి ప్రయత్నంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, 18-22 సంవత్సరాల వయసు గల యువతీయువకులు అర్హులన్నారు. అర్హత సాదించిన అభ్యర్థులకు సంవత్సరానికి సుమారు రూ.2.34 లక్షల జీతం, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం, ఉద్యోగములో సెలెక్ట్ అయిన వారికి ఉన్నత చదువులకు, స్కిల్ ట్రైనింగ్ కూడా అవకాసం ఇవ్వబడునన్నారు. సబ్సిడీ మీద ఇతర సదుపాయాలు కల్పించబడునన్నారు. శ్రీసిటీకి సంబందించిన వివిధ ఇండస్ట్రీ ప్రతినిధులు కూడా పాల్గొంటారన్నారు. అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులు(మూగ, చెవిటి) అయిన వారు పాల్గొనవచ్చన్నారు. యువతకు ప్రభుత్వము కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరములకు నెంబర్ 8886882032ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

నేడు బహుమతులు ప్రదానోత్సవ సభ

నరసాపురం : పట్టణంలోని రుస్తుంబాద కబడ్డీ స్టేడియంలో శ్రీ గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయస్థాయి మహిళా, పురుషుల కబడ్డీ పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. సెమీఫైనల్స్‌లో చోటు దక్కించుకునేందుకు జట్లు మెరుగైన ఆట తీరుతో తలపడ్డాయి. దీంతో పోటీలు ఆసక్తికరంగా సాగాయి. పురుషుల విభాగంలో సిఆర్‌పిఎఫ్ ఢిల్లీ, ఆంధ్ర, నవీన్ యుపి, మహిళల విభాగంలో సిఆర్‌పిఎఫ్ ఢిల్లీ, రాజస్తాన్, కేరళ జట్లు ముందంజలో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మ్యాచ్‌లకు నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మ్యాచ్‌లను నిర్వాహకులతో కలిసి తిలకించారు. శనివారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ సభలో కలెక్టర్ సిహెచ్.నాగరాణి, ఎస్‌పి అద్నాన్‌నయీమ్ అస్మి హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోగులమ్మ ఉత్సవ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి జానకీరామ్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ సిఇఒ వీరలంకయ్య పాల్గొన్నారు.

రేపు సూపర్ సిటిజన్స్‌కు సన్మానం

పాలకొల్లు : పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ ఆడిటోరియంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు సూపర్ సిటిజన్స్‌కు సత్కరిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షులు వంగా నరసింహారావు తెలిపారు. పాలకొల్లు పట్టణానికి మాజీ మంత్రి చేగొండి హరరామ జోగయ్య, మాజీ ఎంఎల్‌ఎలు అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ సిహెచ్.సత్యనారాయణమూర్తి (బాబ్జీ)లను ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు విచ్చేస్తారన్నారు. జయప్రదం చేయాలని నారాయణమూర్తి కోరారు.